# 'శివం'.. శంభో శివ శంభో..!

**(మొదటి పేజీ తరువాయి ) :**
మహాశివరాత్రి రోజు ప్రతి యామంలోనూ శివునికి అభిషేకం చేస్తారు.. రాత్రిలో నాలుగు యామాలుంటాయి.. ఆత్మకి నాలుగు పదాలు ఉన్నట్టు అని అర్థం.. నాలుగో యామంలో జాగరణ ద్వారా ఆత్మ పరమార్థం గోచరించటం జరుగుతుందని ఆధ్యాత్మిక ఉపన్యాసకులు చెబుతారు.. పరమ జ్ఞానోదయమే శివజాగరణ రహస్యం..ముల్లోకాలు, సకల చరాచర సృష్టిలో ప్రతి జీవి, ప్రాణి సమస్త భక్తకోటి ఎదురుచేసే పర్వదినం మహాశివరాత్రి.. లోక రక్షకుడైన పరమశివుడు కోటి సూర్య కాంతులతో మహాశివరాత్రి పర్వదినం నాడు మహాలింగంగా ప్రభవిల్లుతూ ఉద్భవించారని ఈశాన సంహిత గ్రంథంలో చెప్పబడింది. సృష్టికర్త అయిన బ్రహ్మ, స్థితికర్త అయిన విష్ణువుల తగవును తీర్చేందుకు వారిరువురి నడుమ పరమశివుడు మహాతేజో మయంగా లింగరూపంలో ఉద్భవించాడరని ఇతిహాసాల ద్వారా తెలుస్తోంది.. అంతటి విశేషమైన రోజున శివుడి ఆరాధన కోసం శివుడు కొలువైన క్షేత్రాలకు భక్తులు తరలి వస్తుంటారు.. పురాణ దేవతల్లో అత్యంత ప్రజాస్వామికవాది, నిరాడంబరుడు, భార్యను తనలో సగం చేసుకున్న స్త్రీ సమానత్వ వాది, కోరిన వారికి కోర్కెలు ఇచ్చే భోళాశంకరుడైన పరమేశ్వరుని అత్యంత భక్తి, శ్రద్ధలతో, ఉపవాస పూజలతో కొలిచే మహాపర్వదినం మహాశివరాత్రి నేడు.. ప్రతి చాంద్రమాసంలోని 14వ రోజు లేదా అమావాస్యకు ముందు వచ్చే రోజుని శివరాత్రి అంటారు,,కానీ పంచాంగ సంవత్సరంలో వచ్చే పన్నెండు శివరాత్రుల్లో ఫిబ్రవరి లేదా మార్చి నెలల్లో వచ్చే శివరాత్రికి అత్యంత ప్రాముఖ్యత ఉంది.. ఆధ్యాత్మికంగా ఎంతో శక్తివంతమైనది.. మహాశివరాత్రి రోజు భూమి ఉత్తర అర్ధగోళం ఎటువంటి స్థితిలో ఉంటుందంటే మనిషిలోని శక్తి సహజంగానే ఉప్పొంగుతుంది.. శివరాత్రి నాడు ప్రకృతి ఆధ్యాత్మిక శక్తివైపు ప్రయాణింపజేస్తుంది.. మహాశివరాత్రి రోజు తెల్లవారే వరకూ జాగారం చేసి పరమశివుడ్ని భజిస్తారు.. కుటుంబ జీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి సమన్వయం సాధించే రోజు మహాశివరాత్రి.. కుటుంబంలో నివసించే వారికి మహాశివరాత్రిని పరమశివుని కళ్యాణ రోజుగా భావిస్తే, ప్రాపంచిక లక్ష్యాల్లో ఉన్నవారు శివరాత్రి నాడు శివుడు తన శత్రువులను జయించిన రోజుగా భావిస్తారు..కానీ, సన్యాసాశ్రమంలో ఉన్న వారికి శివయ్య ఈ రోజు పరిపూర్ణ నిశ్చలత్వంతో పర్వతంలా అయిపోయిన రోజు,. యోగ శాస్త్రానికి మూలకారకుడు పరమశివుడు, ధ్యానానికి వేల సంవత్సరాల నుంచి ప్రతీకగా నిలిచిన ఆదిగురువు,, ఇక శివుని దేవేరి పార్వతీదేవీల వివాహ మహోత్సవం జరిగిన రోజుని మహాశివరాత్రిగా పెద్ద ఎత్తున హిందువులు పండుగ జరుపుకుంటారు.. శివయ్య లింగాకారంలో ఆవిర్భవించన రోజని ఈ రోజును గురించి శివపురాణం తెలుపుతుంది..

**లింగోద్భవ ప్రాశస్త్యం:-**
సృష్టికర్త బ్రహ్మ, స్థితికారుడు శ్రీమహావిష్ణువుకు తమలో ఎవరు గొప్ప అనే సంవాదం వస్తుంది..ముక్కోటి దేవతల్లో తామే గొప్ప అని ఎవరికి వారు పోటీపడుతారు.. చివరకు తమ వాదన తీర్చమని లయకారుడు మహాశివుడ్ని కోరుతారు.. ఆయన తన రూపంలో ఆద్యంతాలను ఎవరు గుర్తిస్తారో వారే గొప్పవారని చెబుతాడు.. దీంతో బ్రహ్మ విహంగ రూపంలో, విష్ణువు వరాహావతారంలో బయలు దేరుతారు. పరమేశ్వరుడి ఆదిని గుర్తించేందుకు విష్ణువు, అంత్యభాగాన్ని కనుగొనేందుకు బ్రహ్మ వెళ్తారు..ఎంత ప్రయత్నించినా లయకారుడి ఆద్యంతాలను గుర్తించలేక ఆయన్నే ఆశ్రయిస్తారు.. కరుణించిన పశుపతి శివలింగ రూపంలో తన విశ్వరూప దర్శనాన్ని అనుగ్రహిస్తాడు.. బ్రహ్మ విష్ణువులకు శివుడు విశ్వరూప దర్శన భాగ్యం కల్పించిన రోజునే మహాశివరాత్రి.. ఆయన మహాశివలింగంగా ఆవిర్భవించిన సమయంలో నిర్వహించేదే లింగోద్భవాభిషేకం.. శివరాత్రి పర్వదినంలో ఆలయ ప్రధానార్చకులు స్వామి వారికి 11 కాలాల్లో అభిషేకాలు నిర్వహిస్తారు.. వాటిలో 11వ కాలంలో లింగోద్భవాభిషేకం జరుగుతుంది.. ఈ లింగోద్భవాభిషేకాన్ని తిలకించిన వారికి సర్వపాపాలు తొలగి మోక్షం లభిస్తుందని పురాణ ప్రతీతి..

**బిల్వ పత్రం శివునికి ప్రీతికరం:-**
శివునికి ప్రీతికరమైనది బిల్వ పత్రం.. అంటే మారేడు దళం.. త్రిగుణాకర స్వరూపమైన బిల్వ పత్రం శివుని పూజకు విశేషమైనది.. మారెడు దళములతో(ఆకులతో) శివుని పూజించడం వల్ల సర్వాభీష్టాలు నెరవేరుతాయని పురోహితులు తెలుపుతున్నారు.. మూడు జన్మల్లో చేసిన పాపాలు తొలగించే శక్తి మారెడు దళానికి ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి..

**మహాశివరాత్రికి శివాలయాలు సిద్ధం:-**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.. సులువుగా దర్శనమయ్యేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు వంటివి నిర్వహకులు ఏర్పాటు చేసారు.. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలంలో జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవి సమేతంగా పూజలను అందుకునేందుకు ఆలయ నిర్వహకులు అన్ని ఏర్పాట్లు సి ద్ధం చేసారు..

**మహాశివరాత్రికి సర్వం సిద్ధం:-**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.. సులువుగా దర్శనమయ్యేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు వంటివి నిర్వహకులు ఏర్పాటు చేసారు.. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలంలో జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవి సమేతంగా పూజలను అందుకునేందుకు ఆలయ నిర్వహకులు అన్ని ఏర్పాట్లు సి ద్ధం చేసారు..

## మగువ మగువ లోకానికి తెలుసా నీ విలువా

**-మహిళా మణులకు అంతర్జాతీయ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు...**

**వెల్దుర్తి,మార్చి7,ప్రభాతవార్త :** అంచెలంచెలుగా ఎదిగి పత్తికొండ పీఠంపై కూర్చున్న వీరవనిత పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి.అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని ఆమె మహిళగా ఎలా రాణించారో తెలుసుకుందాం.ప్యాపిలి మండలం బూరుగల గ్రామంలో జూన్12,1972లో కమ్మగిరిరెడ్డి,వెంకటలక్ష్మీకి జన్మించిన కంగాటిశ్రీదేవి వెల్దుర్తి మండలం చెరుకులపాడు కంగాటి శివారెడ్డి కుమారుడు చెరుకులపాడు లక్ష్మీనారాయణరెడ్డిని వివాహమాడారు.అప్పటినుంచి భర్త అడుగుజాడల్లో నడుస్తూ ,ప్రజల్లో మమేకమై వెల్దుర్తి సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికై అధ్యక్షురాలిగా పనిచేసింది.అక్కడి నుంచి జిల్లా కెడిసిసి ఛైర్మెన్‌గా, నాబార్డులో సభ్యురాలిగా కొనసాగింది.తన భర్త చెరుకులపాడు నారాయణరెడ్డి మరణానంతరం ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చింది.ఆమె భర్త వైకాపా పత్తికొండ నియోజకవర్గ ఇంచార్జ్‌గా పనిచేస్తుండగా 2017లోమే 21న దారుణ హత్యకు గురయ్యాడు.అప్పటి ప్రతిపక్షనేత వైకాపా అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆ సమయంలో జరిగిన ప్రజాసంకల్పయాత్రలో ఆమెను వైఎస్సార్‌సిపి పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాడు.అప్పటి నుంచి ఆమె గడప,గడపకు తిరిగి అహర్నిశలు శ్రమించి 2019లో పత్తికొండ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సిపి అభ్యర్థిగా పోటీచేసి ప్రత్యర్థిపై 42వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎన్నికైంది. ఈమె మామ బ్రహ్మగుండం ఆలయ కమిటీ ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఈమె భర్త రాజకీయపార్టీకి మండల అధ్యక్షులుగా పనిచేశాడు.ఎంపిటిసి సభ్యులుగా కొనసాగుతూ వైకాపా మండల కన్వీనర్‌గా కొనసాగుతున్నాడు.ఈమె ఎంపిటిసిగా రెండు పర్యాయాలు గెలుపొంది,ఏకగ్రీవమై ఎంపిపి పీఠం దక్కించుకొని ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

## వైద్యశిబిరాలకు ఉచితంగా మందుల పంపిణీ

**బనగానపల్లె,మార్చి7,ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని శైవక్షేత్రాల్లో ఏర్పాటుచేసిన రెడ్‌క్రాస్ వైద్యశిబిరాల కొరకు మందులు పంపిణీ చేయడంలో భాగంగా గురువారం యాగంటి దేవస్థాన వైద్యశిబిరం కా ్యంప్ కన్వీనర్లకు,సైపుల్లాకు దాదాపు లక్ష రూపాయల విలువైన మందులను పంపిణీ చేయడం జరిగిందని రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ ఆర్.మారుతి కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా సైపుల్లా మాట్లాడుతూ దాదాపు పది సంవత్సరాల నుంచి యాగంటి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తుల కొరకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.మొట్టమొదటిసారి చాలా పెద్దఎత్తున మందుల పంపిణీ చేసిన రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి,వైస్ చైర్మన్ మారుతి కుమార్,కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.రెడ్‌క్రాస్ చైర్మన్,వైస్ చైర్మన్లు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి,కర్నూలు రెడ్‌క్రాస్ చైర్మన్ మెడికల్ రెప్స్ కాత్యాయిని మెడికల్స్ అండ్ సెవెన్‌హిల్స్ ఆసుపత్రి వారి సౌజన్యంతో,వారి సహకారంతో మందులు సేకరించి పంపిణీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు.భగవంతుని సేవలు,భక్తుల సేవలో రెడ్‌క్రాస్ సభ్యులు సేవలు అందిస్తారని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ దస్తగిరి,కోశాధికారి నాగేశ్వరరావు,కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ బాషా,తెలకపల్లి కృష్ణ చైతన్య,డీఎఫ్‌వో రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు

**వెల్దుర్తి,మార్చి3,ప్రభాతవార్త :** బ్రహ్మగుండం ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు అని పత్తికొండ సబ్‌డివిజన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు.వెల్దుర్తి పట్టణ సమీపంలో వెలసిన బ్రహ్మగుండం పుణ్యక్షేత్రంలో నిర్వహించే కామేశ్వరి దేవి సహిత బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గురువారం సాయంత్రం పత్తికొండ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.వెల్దుర్తి సర్కిల్ సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి,ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి బ్రహ్మగుండ క్షేత్రం చేరుకొని ఆలయ కమిటీ ఛైర్మెన్ బొమ్మనపెద్దిరెడ్డితో మాట్లాడారు.ఆలయ ప్రాంగణంలో,కోనేటి వద్ద,స్నానపుగదుల ఏర్పాటు,క్యూలైన్,పార్కింగ్ స్థలాలపై ఆరా తీశారు.బ్రహ్మగుండంలో తిరుగుతూ ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఆకతాయిలు,అల్లరిమూకల భరతం పడతామన్నారు.భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్ ఔట్ పోస్టును ఏర్పాటుచేశామన్నారు.మహిళలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే ఈ క్షేత్రంలో బందోబస్తు చేస్తున్న సిఐ,ఎస్సై,సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళితే కేసులు తప్పవన్నారు.ఉత్సవాలను ప్రశాంతంగా అందరు కలిసిమెలిసి చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వెల్దుర్తి సర్కిల్ సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి,ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి,బ్రహ్మగుండం ఛైర్మెన్ బొమ్మనపెద్దిరెడ్డి,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణంతో మహిళల సహాసం.. వన్యమృగాల సంరక్షణకై విధులు..

**: నేడు ప్రపంచ మహిళ దినోత్సవం**
**: ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్‌లో విధి నిర్వహణలో మహిళలు**
**: 13మందికి పైగా డివిజన్‌లో మహిళ ఉదో ్యగులు**

**ఆత్మకూరు మార్చి7,ప్రభాతవార్త:** ప్రాణంతో సహాసం చేస్తూ వన్యమృగాల సంరక్షణకై విధులు నిర్వహిస్తూ 24గంటలు పర్యావరణం వన్యప్రానుల సంరక్షణనే లక్ష్యంగా ఎంచుకొని విధి నిర్వహణలో ముందుకెళ్తున్న అటవీశాఖలో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు చిన్నస్థాయి ఉద్యోగుల నుంచి పై స్థాయి ఉదో ్యగుల వరకు పురుషులతో సమానంగా మేము సహితం అంటూ పెద్దపులుల అభయారణ్యంలో విధి నిర్వహణలో ప్రాణాలతో సహాసం చేస్తున్న మహిళ ఉద్యోగులపై ప్రత్యేక కథనం... నేడు ప్రపంచ మహిళ దినోత్సవం సందర్భంగా సాదారణంగా మహిళలు అన్ని ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహించడం సర్వసాదరణం అయితే ఇక్కడా ఒక ప్రత్యేకత ఉంది. అటవీశాఖలో ఉద్యోగం చేయాలంటే ప్రాణంతో మహిళలు సహాసం చేయాల్సిందే పెద్దపులుల అభయారణ్యంలో వన్యమృగాల సంరక్షణలో ముందుకు వెళ్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ మహిళ లోకంలో కొత్త తరహా ఉదో ్యగాలను చేసేందుకు మహిళలు ఎంతో మంది అటవీశాఖలో ముందుకు వచ్చారు. నంద్యాల జిల్లాలోని ఎన్ఎస్‌టిఆర్ పరిధిలో ఆత్మకూరు వన్యప్రాని విభాగంలో డిఆర్వోలు, ఎఫ్ఎస్‌ఓలు, ఎఫ్‌బిఓలు, ఏబిఓలు దాదాపుగా 13మందికి పైగా మహిళలు తమ ఉదో ్యగ కర్తవ్యాన్ని నిర్వహించుకుంటూ ముందుకు వెళ్తున్నారు. పర్యావరణం పరిరక్షణతో పాటు వన్యప్రానుల సంరక్షణ ఎంతో కీలకంగా ఉదో ్యగ బాధ్యత ఉన్నప్పటికి విధి నిర్వహణలో ఆలసత్వం చేయకుండా పురుషులతో సమానంగా మహిళలు ముందుకు వెళ్తూ ఉన్నారు. అడవిలో విది నిర్వహణలో ఉన్నప్పుడు వన్యక్రూర మృగాలు ఏక్షణమైన దాడులు చేసే ప్రమాదం ఉన్నప్పటికి మహిళలు వన్యప్రానులను భయందోళన చెందకుండా తమ విధులు ముఖ్యంగా బావిస్తూ ముందుకు వెళ్తున్నారు. నేడు ప్రపంచ మహిళ దినోత్సవం సందర్భంగా నల్లమల అటవీ ప్రాంతంలో పెద్దపులుల అభయారణ్యలో మహిళలు ఎంతో మంది విధి నిర్వహణలో ముందుకు వెళ్తున్నారు. కొన్ని చోట్ల మహిళల విధుల పట్ల కొందరు అధికారులు చిన్నచూపుచూడడం లాంటివి జరగకుండా అందరు సమానమే అంటూ ముందుకు వెళ్తున్న మహిళలకు అన్ని రంగాలలో ముందుకు వెళ్లాలని ఆలోచన ఒక అటవీశాఖలోనే ఉందని చెప్పవచ్చు. ప్రస్తుతం విధి నిర్వహణలో ప్రాణంతో సహాసం చేసే మహిళ ఉద్యోగుల జీవితం ఇది అని చెప్పవచ్చు. ఇలాంటి ప్రపంచ మహిళ దినోత్సవాలను అటవీశాఖలో మహిళలు ఎంతో గొప్పగా జరుపుకోవడం విశేషం.

## ప్రభుత్వ పూర్తిస్థాయి క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభం

**-ఆర్థికశాఖ మంత్రి బుగ్గన**

**కర్నూలు అర్బన్, మార్చి 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మొట్టమొదటి పూర్తిస్థాయి కా ్యన్సర్ హాస్పటల్ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చయడం జరిగింది. స్థానిక సర్వజన వైద్యశాలలో రూ.120 కోట్ల వ్యయంతో నూతనంగా నిరి ్మంచిన స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిటూ ్యట్‌ను రూ.3.46 కోట్లతో వ్యయంతో నూతనంగా నిర్మించి 10 బెడెడ్ బర్ ్న యూనిట్‌ను 3.22 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించారు. ఈసందర్భంగా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాద్ మాట్లాడుతూ కర్నూలులో స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌ను ప్రారంభించడం రాష్ట్రంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి క్యాన్సర్ హాస్పటల్ అని పేర్కొన్నారు. ఎటువంటి సమస్యకైనా ఉమ్మడి రాష్ట్రాల్లో ప్రైవేట్ క్యాన్సర్ ఆసుపత్రులు ఒమెగా లాంటివి ఉన్నాయో వాటిలో ఏవిధంగా అయితే ట్రీట్‌మెంటు ఇస్తున్నారో అంతకంటే మెరుగైన పరికరాలతో పాటు అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులతో పాటు సామాన్యుడు ట్రీట్‌మెంటు పొందుటకు అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి రూ.120 కోట్లు ఖర్చు అయితే అందులో కేవలంల పరికరాల కోసం 84 కోట్లు, బిల్డింగ్‌నిర్మాణానికి 36 కోట్ల రూపాయలు ఖర్చుచేయడం జరిగిందన్నారు. స్టేట్‌క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లో 250 మంది వైదు ్యలు, సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి వైద్యం పట్ల ఎంత అలోచన, చిత్తశుద్ది ఉందనే విషయాన్ని దీన్నిబట్టి తెలుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎన్ని మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారో అంతకంటే ఎక్కువ మెడికల్ కళాశాలలను మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా నాడు నేడు కింద పిహెచ్‌సిలు, హెల్త్‌సెంటర్లు హాస్పటల్స్, మెడికల్ కళాశాలల రూపురేఖలు మార్చడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టరు డా.జి సృజన, ఎమ్మెల్సీ మధుసూదన్, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే హాఫిజ్‌ఖాన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి వెంకటరంగారెడ్డి, డిప్యూటి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి, సిఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అటవీశాఖ డిప్యూటి డైరెక్టర్‌గా సాయిబాబ త్వరలో బాధ్యతలు

**ఆత్మకూరు మార్చి7,ప్రభాతవార్త:** వన్యప్రాని విభాగంలో డిప్యూటి డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆలెన్‌చాంగ్ టెరాన్ రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులు బదిలీ చేయడంతో ఆ స్థానంలో ఆత్మకూరు అటవీశాఖ డిప్యూటి డైరెక్టర్‌గా సాయిబాబ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. 2011 - 12 సంవత్సరాల మధ్యలో ఎన్ఎస్‌టిఆర్ పరిధిలోని శ్రీశైలం ఎప్‌డిపిటిలో ఏసిఎఫ్‌గా శిక్షణ అధికారిగా విధులు నిర్వహించారు. ఆత్మకూరు వన్యప్రాని డివిజన్‌లో ఉదో ్యగ పూర్తి బాధ్యతలు తీసుకొని మళ్లీ తిరిగి ఇదే డివిజన్‌కు రావడం పలువురు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వుల జాబితాలో ఆత్మకూరు అటవీశాఖ డిప్యూటి డైరెక్టర్‌గా సాయిబాబ రావడంతో పర్యావరణం, వన్యప్రానుల సంరక్షణపై అవగాహన ఉండడం మంచిశుభపరిణామని వన్యప్రాని, పర్యావరణ ప్రేమికులు, అటవీ సిబ్బంది ఘనంగా స్వాగతం పలకనున్నారు.

## సెంట్రల్ ఆర్మ్‌డ్‌ఫోర్స్ సిబ్బందితో కవాతు నిర్వహించిన సీఐ గంటా సుబ్బారావు

**బనగానపల్లె,మార్చి7,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలో బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు పర్యవేక్షణ ఎస్ఐ రామిరెడ్డి ఆధ్వర్యంలో రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ సిబ ్బందితో కలిసి బనగానపల్లె సీఐ సుబ్బారావు ఎస్ఐ రామిరెడ్డి మరియు సిబ్బందితో కలిసి కవాతు చేయడం జరిగింది.ఈ సందర్భంగా సీఐ గంటా సుబ్బారావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచనలతో బనగానపల్లె పట్టణంలో గురువారం సాయంత్రం కవాతు నిర్వహించడం జరిగిందన్నారు.రాబోవు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెంట్రల్‌ఆర్మ్‌డ్ ఫోర్ ్స సిబ్బంది మరియు సిబ్బందితో కలిసి నవాబ్ సర్కిల్,ఆస్థానం,ఓల్డ్ బస్టాండ్,పొట్టిశ్రీరాములు సర్కిల్,మార్కెట్‌యార్డు,బస్టాండ్ రోడ్డు నందు కవాతు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కవాతు అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్ కుమార్,ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్,ఎస్ఐలు,75 మంది బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బీసీ సమక్షంలో వైకాపాను వీడి తేదేపాలో చేరిన 115 కుటుంబాలు

**- పార్టీలో చేరిన వారికి స్వయంగా కండువాలువేసి ఆహ్వానించిన బీసీ**

**బనగానపల్లెరూరల్,మార్చి7,ప్రభాతవార్త:** గడిచిన ఐదేళ్ల కాలంలో ఆం ధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అధ:పాతాళానికి తొక్కేయడమే కాకుండా రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి లేకుండా రా ష్ట్రాన్ని దోచుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీరుకు సొంత పార్టీ నేతలే తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో వైసీపీ పార్టీలో ఇమడలేక రాష్ట్రాన్ని తిరిగి యధావిధిగా అభివృద్ధి పరచాలంటే అది ఒక తేదేపా అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని పెద్దఎత్తున వైకాపా వీడి టీడీపీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ పేర్కొన్నారు.ఇదిలా ఉండగా గురువారం తాజాగా బనగానపల్లె పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు అవుకు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన కైప వెంకట్రామిరెడ్డి,కైప చంద్రశేఖర్‌రెడ్డి,మంచాల వీరప్రతాప్‌రెడ్డి,సదుకొట్టం శ్రీనివాసులరెడ్డి,వేములపాటి శివారెడ్డి, మంచాల భాస్కర్‌రెడ్డి,మాజీ ఎంపిటిసి శ్రీరాముల దేవదానం,క్రిష్టిపాడు వలి,బత్తుల మహేష్,అర్జునాపురం సుబ్రహ్మణ్యం,మద్దనపు రమణ,కొమితి గంగన్న,చాకలి పుల్లయ్య తదితరులు వైకాపాకు చెందిన 115 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో వైకాపాను వీడి తేదేపాలో చేరారు.ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి తానే స్వయంగా తేదేపా కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా తేదేపాలో చేరిన వైకాపా నేతలు మాట్లాడుతూ బనగానపల్లె నియోజవర్గంతోపాటు సుంకేసుల గ్రామా న్ని అభివృద్ధిపరచడం ఒక బీసీ జనార్దన్‌రెడ్డి వల్లనే సాధ్యమవుతుందని నమ్మి వైకాపాను వీడి తేదేపాలో చేరుతు న్నరన్నారు.స్థానిక తేదేపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రజియాబేగం మృతికి బీసీ రాజారెడ్డి సంతాపం

**బనగానపల్లెరూరల్,మార్చి7,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని శివనందినగర్‌కు చెందిన సజ్జాద్ అలీ మాతృమూర్తి రజియా బేగం గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి వారి నివాసానికి చేరుకుని రజియా బేగం భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులరి ్పంచారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.బీసీ రాజారెడ్డి వెంట తేదేపా నాయకులు ఉన్నారు.

## ఉచ్చులో పడిన పులి ఆరోగ్యంగా ఉంది - ఎఫ్‌డి బిఎన్.మూర్తి

**: గాయపడిన పెద్దపులికి తిరిగి లేచేవరకు వైద్యచికిత్స అందిస్తాం**

**ఆత్మకూరు మార్చి7,ప్రభాతవార్త:** ఉచ్చులో పడిన పెద్దపులి ఆరోగ్యంగా కొలుకునేందుకు మెరుగైన వైద్య చికిత్సలు అందించే విదంగా ప్రత్యేక చొరవ తీసుకోవడం జరుగుతుందని ఎన్ఎస్‌టిఆర్ ఎఫ్‌డిపిటి బిఎన్.మూర్తి పేర్కొన్నారు. గురువారం బైర్లూటి ఏకో టూరిజంలో పులి ఆరోగ్య స్థితిగతులపై ప్రత్యేకించి ప్రభాతవార్త మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా ఎఫ్‌డి మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ముఖ్యంగా పర్యావరణంపై ప్లాస్టిక్ జోన్‌గా నిషేదం చేసే విదంగా అటవీశాఖ ప్రత్యేక చొరవ తీసుకుంటుందని వివరించారు. శ్రీశైలం దేవస్థానం అధికారులు సహకరించిన, సహకరించకపోయిన అటవీశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు త్వరలోనే ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ముఖ్యంగా వన్యప్రానుల సరంక్షణతో పాటు పర్యావరణంను కాపాడే విదంగా స్వచ ్చంద సేవ సంస్థలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ప్రస్తుతం ఎన్‌హెచ్ 340సి రహదారుల విస్తరణ పనులపై ఎలాంటి నివేదికలు రాలేదని



వివరించారు. అటవీ మార్గంలో విస్తరణ పనులు చేపట్టేందుకు అనుమతులు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. పెద్దపులుల సంరక్షణలో నిర్లక్ష్యం చేయకుండా వాటిని కాపాడుకునే విదంగా అటవీశాఖ సిబ్బంది ముందుంటామని తెలియజేశారు. అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు.. అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళ సిబ్బందిని అధికారులు ఇబ్బందులకు గురి చేస్తే తప్పుని సరిగ్గా చర్యలు తీసుకోవడం తప్పదని ఎన్ఎస్‌టిఆర్ ఎఫ్‌డిపిటి డైరె ్క్టర్ బిఎన్.మూర్తి పేర్కొన్నారు. నేడు ప్రపంచ మహిళ దినోత్సవం సందర ్భంగా అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళలందరికి ప్రత్యేక దన్యవాదాలు తెలియజేశారు. తమ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళ ఉదో ్యగి ఇచ్చిన ఫిర్యాదును విచారణ చేయడం ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు. త్వరలోనే వాస్తావం అని తెలితే తప్పుని సరిగ్గా తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోక తప్పదని ఘాట్‌గా హెచ్చరించారు.

## దైవదర్శనానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు

**హొళగుంద,మార్చి 7,ప్రభాతవార్త :** హొళగుంద గ్రామ పంచాయతీ కాంట్రాక్టర్ పారిశుద్ధ్య ఆటో డ్రైవర్ మల్లికార్జున శ్రీశైలం దర్శనానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్న అనంతరం అనారోగ్యం పాలయ్యాడు బంధుమిత్రులు ఆసుపత్రిలో చేర్పించగా వైద్య చికిత్స పొందుతూ కోలుకోలేక తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడని పంచాయతీ కార్యదర్శి ్శ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. మృతుడికి భార్య శశికళ,ఒక కుమారుడు వున్నారు. మృతుడి కుటుంబాన్ని సర్పంచ్ చలవాది రంగమ్మ,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్,సర్పంచ్ తనయుడు పంపాపతిలు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మట్టి ఖర్చులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందచేశారు.

## మాంటిస్సోరి ఐ కిడ్స్‌లో ఘనంగా ఫ్లవర్ గ్లోరి

**కర్నూలు విద్య, మార్చి 7, ప్రభాతవార్త:** మహిళా దినోత ్సవాన్ని పురస్కరించుకొని ఏ క్యాంపు నందు గల మాంటిస్సో రి పాఠశాలలో ఐకిడ్స్ విభాగంలోని పిల్లలకు రుచికరమైన భోజనం మాత్రమే కాకుండా పౌష్టికాహారాన్ని అందించాల్సి న ప్రథమ బాధ్యత మాతృమూర్తిదే అని తెలియచేయడం కోసం ఫ్లవర్ గో ్లరి అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంతో మంది మాతృమూర్తులు తమ పిల్లలతో కలిసి ఈకార్యక్రమంలో ఉత్సా హంగా పాల్గొని తాము చేసిన పదార్థాల గురించి వివరించారు. ఈసందర్భంగా పాఠశాల అధినేత కెఎన్‌వి రాజశేఖర్ మాట్లాడుతూ నేడు చాల మంది పిల్లలు బయటి ఆహారపదార్థాలకు ఆకర్శితులై తన ఆరోగ్యాన్ని తమ చేజేతులా నాశనం చేసుకుంటున్నారన్నారు. అలాకాకుండా ఉండాలనే అమ్మ లాలిపాట ఎంత తియ ్యనో, అమ్మచేతి వంట అంతకంటే తియ్యన అని ప్రతి అమ ్మ తమ బిడ్డలకు తెలియజేసి ఆరోగ్యవంతమైన సమాజ దిశగా అడుగులు పడాలనే సంకల్పంతో ఈకార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**ఆలూరు,మార్చి 7,ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలు ఒకరోజు ముందుగా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు మహిళా సాధికారత కోఆర్డినేటర్ సుశీల,ప్రిన్సి పల్ జ్ఞానేశ్వర్ ఆద్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సి పల్ మాధవి,అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి విద్యతోనే జీవితం ప్రారంభం

**పత్తికొండ,మార్చి 7,ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థికి విద్యతోనే జీవితం ప్రారంభమవుతుందని ఏవిఆర్ హైస్కూల్ ప్రిన్సి పల్ లతా అన్నారు. గురువారం పట్టణంలోని హోసూరు రోడ్డులోని ఏవిఆర్ హైస్కూల్‌లో ఫేర్వెల్ పార్టీ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువు నేర్పిన విద్యతోనే జీవితంలో ఏదైనా సాధించవచ్చన్నారు. గురువు నేర్పిన విద్య లేకపోతే జీవనం కొనసాగడం కష్టంగా ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి గురువు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినాలన్నారు. విద్యార్థులకు వీడ్కోలు పలకడం అంత సులువైన విషయం కాదన్నారు. అన్ని వేళల ఉపాధ్యాయులకు సహకరించిన విద్యార్థులను ఆమె అభినందించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయులను శాలువా,పూలమాలతో సన్మానించి ప్రత్యేక బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సి పల్ శివశంకం నాయుడు, చిరంజీవి,నాగేంద్ర, ఆంజనేయులు, భాగ్యశ్రీ,మంజుల, వెంకటేష్, మదన్‌గోపాల్, సుచిత్ర,ఎం శివశంకర్,ప్రైమరీ ఇంచార్ ్జ షాహిన్,అంబిక,ప్రశాంతి, లక్ష్మి,పక్కీరప్ప, రోహిణి, మాధవి,రూఖ్య,సింధు,జయసుధ,అరుణజ్యోతి,మైకిల్,జయరాం నాయక్ పాల్గొన్నారు.

## వైఎస్ షర్మిలను కలిసిన మహేంద్రనాయుడు

**దేవనకొండ,మార్చి 7,ప్రభాతవార్త :** ఎమ్మెల్యే అభ్యర్థిని పరిశీలించుటలో భాగంగా కాంగ్రెస్ పార్టీ పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఆహ్వానం మేరకు గురువారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్రనాయుడు వైఎస్ షర్మిలను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో పలు విషయాలు పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలకు వివరించినట్లు తెలిపారు.

## స్థూపంపై ఏర్పాటు చేసిన పేర్లను తొలగించాలి

**నంద్యాల టెక్కె, 07 మార్చి, ప్రభాతవార్త:**
నంద్యాల మున్సి పల్ కార్యాలయం ఎదుట నిర్మించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్థూపంపై ఏరా ్పటు చేసిన పేర్లను తొలగించాలని ఎస్‌డీపీఐ నాయకులు గురువారం నంద్యాల మున్సి పల్ ఛైర్మెన్ మాబున్నీసాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్‌డీపీఐ పట్టణ అధ్యక్షులు హనీఫ్ మాట్లాడుతూ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, మైనార్టీ సంఘాలు కలిసి 2016లో మున్సి పల్ కార్యాలయం ఎదురుగా ఉన్న సర్కిల్‌ను మౌలానా అబుల్ కలాం ఆజాద్ సర్కిల్‌గా నామకరణం చేయడం జరిగిందని తెలిపారు. ఇటీవల మున్సి పల్ అధికారులు అబుల్ కలాం స్థూపం ఏర్పాటు చేసి దానిపై రాజకీయ నాయకుడి పేరు, వైసీపీ రంగులు వేయడం ఆజాద్‌ను అవమానించడమే అన్నారు. ఇప్పటికైనా నాయకుడి పేరు, వైసీపీ రంగులు తొలగించాలని కోరుతూ మున్సి పల్ ఛైర్మెన్‌కు వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. సమస్యను పరిష్కరించి రాజకీయాలకు అతీతంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ సర్కిల్‌ను అభివృద్ధి చేసి ప్రారంభించాలని ఆయన కోరారు.

## వ్యాపారులపై పన్నులు విధించడమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయం

**నంద్యాల, 07 మార్చి, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేని వైసీపీ ప్రభుత్వం వ్యాపారులపై పన్నులు విధించడమే ధ్యేయంగా పెట్టుకుందని టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎండీ.ఫిరోజ్ ఆరోపించారు. గురువారం నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో వ్యాపారికి భరోసా - ఫరూక్ హమేషా కార్యక్రంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాలలో అధిక శాతం మంది ప్రజలు వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్నారని గత 20ఏళ్లుగా నంద్యాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వ్యాపార వర్గాలపై తరుచూ పన్నులు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సేల్ ట్యాక్స్, జీఎస్టీ, కరెంటు బిల్లులు ఇతరత్రా వాటిని పెంచడంతో వ్యాపారస్తులు వాటిని కట్టకలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సి పల్, మార్కెట్‌యార్డు, ప్రభుత్వ షాపులను అతి తక్కువ ధరలకు తీసుకుని ఎమ్మెల్యే శిల్పా కుటుంబం కబ్జా చేస్తుందని ఫిరోజ్ విమర్శించారు.

## ఆజాద్ స్థూపంపై శిల్పా పేరు తొలగించాలి

**- ఎన్ఎండీ.ఫరూక్**

**నంద్యాల, 07 మార్చి, ప్రభాతవార్త:** నంద్యాల మున్సి పల్‌కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అబుల్ కలాం ఆజాద్ స్థూపంపై శిల్పా పేరును తొలగించాలని నంద్యాల తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి ఎన్ఎండీ.ఫిరోజ్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫరూక్ మాట్లాడుతూ చిన్న చిన్న రోడ్లు, కాల్వలు వేసుకుంటూ ఎమ్మెల్యే శిల్పా తామే అభివృద్ధి చేశామని పెద్ద పెద్ద శిలాఫలకాలు వేసుకుంటున్నారని దీంతో ఆ ప్రాంత ప్రాధాన్యత కోల్పోయినట్లవుతుందని అన్నారు. నంద్యాలలో రోడ్ల వెడల్పు, డివైడర్లు, లైటింగ్ ఏర్పాటు చేసింది తెదేపా హయాంలోనని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పైరల్ లైట్లు వేసి అభివృద్ధి తామే చేశామని పెద్ద పెద్ద శిలాఫలకాలు వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అలా శిలా ఫలకాలు వేసుకోవాలనుకుంటే తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎన్నో వేసుకునే వాడినని కాని తనకు ఆ అలవాటు లేదని ఫరూక్ తెలిపారు.

## క్రైస్తవుల హక్కులను మేనిఫెస్టోలో చేర్చిన పార్టీలకే మద్దతు

**ఆదోనిలీగల్, మార్చి07, ప్రభాతవార్త;** క్రైస్తవుల హక్కులను తమ మేనిఫెస్టోలో చేర్చిన రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ఆదోని క్రిస్టియన్ యునైటెడ్ చర్చిస్ అసోసియేషనన అధ్యక్షుడు కల్వరికొండ ఆనందరాజు అన్నారు. గురువారం పట్టణంలోని రాజశ్రీ హాల్‌లో ఏసీ యూసీఏ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు క్రైస్తవులు ఎన్నికల సమయాల్లో మాత్రమే గుర్తుకొస్తున్నామని, ఎన్నోమార్లు తమ సమసయలపై గళ మెత్తాని విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. నియోజకవర్గంలో 50 వేల జనాభా కలిగిన తమకు కనీసం ఇప్పటివరకు ఏ పార్టీ నామినేటెడ్ పోస్టులు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తాము కూడా చైతన్యమయ్యాయమని, సంఘటితంగా వచ్చే ఎన్నికల్లో తమ సమస్యలను పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో చేర్చిన వారికి తమ మద్దతు తెలుపుతామన్నారు. పట్టణంలో క్రైస్తవుల కమ్యూనిటీ హాల్‌కు ఎకరా కేటాయించి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో క్రైస్తవుల సమాధులకు స్థలాలు ఇవ్వాలన్నారు. చర్చిల నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు సులభతరం చేయాలని కోరారు. చర్చిలపై క్రైస్తవులపై దాడులు చేయకుండా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. ఇళ్ల స్థలాలు లేని పాస్టర్లకు స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏసీయూసీఏ ప్రధాన కార్యదర్శి ఎజ్రా శ్రీధర్, ట్రెజరర్ థామస్, గౌరవాధ్యక్షుడు ఆల్బర్ట్, సభ్యులు బెనర్జీ రాజు, మనోహర్, జేమ్స్, దేవదాసు, నీలాంబరం, సంగటి దేవదానం పాల్గొన్నారు.

## దుర్గా భోగేశ్వరుడి గ్రామోత్సవం వర ప్రయాణం

**గడివేముల, మార్చి07, ప్రభాతవార్త;** మండలంలోని శ్రీ దుర్గా భోగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని దుర్గా సమేత భోగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను గడిగరేవుల గ్రామం నుంచి గురువారంనాడు పురవీధుల గుండా మేళతాళాల నడుమ భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం వర ప్రయాణం కార్యక్రమం నిర్వహించారు. 8న స్వామివారి ఆలయ ప్రవేశం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు జరగనున్నాయని, 9న నందివాహన సేవ, తిరుమంజనం, కళ్యాణోత్సవం, 10న రథోత్సవం, 11న నాకబలి, వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, ఆలయ చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## హామీలు వందశాతం అమలుచేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్

**- రాష్ట్రజలవనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల**

**ఆళ్లగడ్డ, మార్చి 7, ప్రభాతవార్త:** వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలుచేసిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర జలవనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం నవరత్నాలు కార్య క్రమంలో భాగంగా ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో అర్హులైన జగనన్న ఇంటిస్థలాల లబ్దిదారులకు పట్ట ణంలోని తహాశీల్దార్ కార్యాలయ అవరణలో గంగుల ప్రభాకర్‌రెడ్డి చేతులమీదుగా 4862 మంది లబ్ది దారులకు ఇంటిస్థలాల పట్టా పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆళ్లగడ్డ మండల పరిధిలో 1088 మందికి గాను 862 మందికి ఉయ్యాలవాడ మండల పరిధిలో 765 మందికి గాను 686 మందికి, శిరివెళ్ళ మండల పరిధిలో 1138 మందికి గాను 1042 మందికి, చాగలమర్రి మండల పరిధిలో 1651 మందికి గాను 1309 మందికి, రుద్రవరం మండల పరిధిలో 901 మందికి గాను 831 మందికి, దొర్ని పాడు మండల పరిధిలో 522 మందికి గాను 482 మంది లబ్దిదారులకు ఇంటిస్థలాల పట్టాలను పంపిణి చేశారు.6 మండలాల తహాశీల్దార్లు, విఆర్ఓలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# "కాంగ్రెస్ పార్టీలోకి టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పోతిరెడ్డి"



**కొలిమిగుండ్ల, మార్చి 7, ప్రభాతవార్త :** బనగానపల్లె నియోజక వర్గానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి మరోసారి బనగానపల్లె నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కలవడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. 2014ఎన్నికల్లో తన సమీప బంధువు బీసీ జనార్ధనరెడ్డి గెలుపుకు తీవ్రంగా కృషి చేసిన పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ జనార్ధన్‌రెడ్డి సమీప బంధువుగా బనగానపల్లెతో పాటు, జిల్లా రాజకీయాల్లో తనదైన శైలిలో పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి చక్రం తిప్పారు. అయితే గత 2019ఎన్నికల్లో బీసీ జనార్ధనరెడ్డి ఓటమి అనంతరం రాజకీయాలకు దూరంగా వున్న పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి గత కొంత కాలంగా బీసీ జనార్ధన్‌రెడ్డి తీరుపై విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఇద్దరి మధ్య వున్న విబేదాలతో అసమ్మతి నేతల లిస్టు తీసుకొని బీసీకి వ్యతిరేకంగా తెదేపా అధిష్టానానికి సైతం పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి పిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో పోతిరెడ్డి తీరుపై మరింత ఆగ్రహంతో వున్నట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిని దగ్గరకు చేర్చుకోరాదని బీసీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. బీసీతో విబేధాల కారణంగా ఇటీవల కొద్ది రోజుల క్రితం తెలుగుదేశం పార్టీకి పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి రాజీనామా చేశారు. అనంతరం తన తండ్రి, రిటైడ్ హెడ్‌మాస్టర్ కీ.శే.లు పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి జ్ఞాపకార్థం సేవాట్రస్ట్ స్థాపించి కొలిమిగుండ్ల మండలం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ దశలో వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా చురుకైన పాత్ర పోషించాలని భావిస్తున్న పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఏదో ఒక పార్టీలో చేరుతారని అంతా భావించారు. బీసీపై కోపంతో ఆయన ఓటమి కోసం పని చేయడానికి వైసీపీలో చేరుతారన్న వార్తలు పెద్ద ఎత్తున వచ్చాయి. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీ తరుపున ఏకంగా బనగానపల్లె నియోజకవర్గం నుండి పోటీ చేయాలని భావిస్తూ వైఎస్ షర్మిలను కలవడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి వచ్చే ఎన్నికల్లో బనగానపల్లె నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేయడానికి దాదాపు మార్గం సుగమమైనట్లు పలువురు పేర్కొంటున్నారు .ఇదే జరిగితే నియోజకవర్గంలో ఎవరి ఓట్లు చీలుతాయోనన్న ఆసక్తి ప్రజల్లో నెలకొంది. చాలా కాలంగా కొలిమిగుండ్ల మండలంలో రాజకీయ ప్రాధాన్యత కలిగిన కుటుంబంగా, ఫ్యాక్షన్ నేపథ్యం కలిగిన కుటుంబంగా ఉన్న పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కుటుంబానికి కొలిమిగుండ్ల మండలంలో కొంతమేర ఓటు బ్యాంకు కలిగి ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. మరోవైపు రాష్ట్ర విభజన అంశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిన కాంగ్రెస్ పార్టీ ఇటీవల వైఎస్ షర్మిల బాధ్యతలతో కాస్తా పుంజకుంటోంది. పక్క రాష్టాలైన తెలంగాణ, కర్ణాటక రాష్టాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండటం ఎపిలో సైతం కాంగ్రెస్ పార్టీ ఇమేజ్‌ని పెంచిందని చెప్పవచ్చు. దీనికి తోడు విభజన అంశాన్ని సైతం ఎపి ప్రజలు ఇప్పుడిప్పుడే కొంతమేర మరిచిపోతుండడం ఆ పార్టీకి కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు. బనగానపల్లె నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకును తట్టి లేపితే అభ్యర్థి గణనీయమైన ఓట్లు సాధించే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే ప్రముఖ రాజకీయ పార్టీలకు కొంత నష్టం కలిగించే అంశంగా చెప్పవచ్చు. అయితే పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి బీసీ జనార్ధన్‌రెడ్డికి మధ్య విభేదాల దృష్ట్యా బీసీ ఓటు బ్యాంకును చీల్చడానికే పోతిరెడ్డి ఎక్కువగా దృష్టి సారించవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో కాటసాని రామిరెడ్డి, బీసీ జనార్ధన్‌రెడ్డి మధ్య నువ్వా నేనా అన్న రీతిలో గట్టి పోటీ ఎదుర్కొంటున్న నేపథ్యంలో 2,3 వేల ఓట్లు చీలినప్పటికి ప్రధాన పార్టీల గెలుపోటములపై అది ప్రభావం చూపే అవకాశం వుంటుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఏది ఎమైనా పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి మాత్రం తనదైన శైలిలో అడుగులు వేస్తూ బనగానపల్లె నియోజకవర్గంలో రాజకీయాంగా చర్చనీయాంశం అవుతుండడం విశేషం.

# ట్రంకుపెట్టెలను అందజేసిన దాత కాటం రమేష్‌రెడ్డి



**పగిడ్యాల, మార్చి 7, ప్రభాతవార్త :** పగిడ్యాల మండలం ముచ్చుమర్రి జెడ్పీపా ఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను 10వతరగతి విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు గాను నూతనంగా 10వతరగతి పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ముచ్చుమర్రి జెడ్పీపాఠ శాల విద్యార్థినీ విద్యార్థులు, నెహ్రూనగర్ జడ్పీపాఠశాల విద్యార్థినీ విద్యార్థులు మండల కేంద్రమైన పగిడ్యాల జెడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్షలు రాసేవారు. దీంతో విద్యార్థినీ విద్యార్థులు ఎంతో వ్యయప్రయాసాలకు గురయ్యేవారు. అయితే ఈ విద్యాసంవత్సరానికి ముచ్చుమర్రి జెడ్పీపాఠశాలలో పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటుచేడయంతో విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షా కేంద్రానికి ప్రశ్నపత్రాలకు సంబంధించి 7 ప్రశ్నపత్రాలకు గాను సెట్-1, సెట్ -2కు సంబంధించి మొత్తం 14 ప్రశ్నపత్రాలను బండ ల్సులను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచేందుకు గాను రూ. 20,000లువిలువచేసే 14 ట్రంకు పెట్టెలను కొత్త ముచ్చుమర్రికి చెందిన కాటం రమేష్‌రెడ్డి గురువారం ఆయన పినతండ్రి కాటం రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఉచితంగా అందజేసినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కౌశల్యబాయి, పాఠశాల ఉపాధ్యా యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ కోరారు. నూతనంగా పరీక్షా కేంద్రాన్ని కేటాయించిన ఏపి ప్రభుతా ్వనికి ఏపిశాప్ చైర్మెన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి ముచ్చుమర్రి, నెహ్రూనగర్ జెడ్పీపాఠశాల విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు ధన్యవాధాలు తెలిపారు. పకడ్బందీగా ఏలాంటి అవాంచనీయమైన సంఘటనలు జరగకుండా పరీక్షలు నిర్వహిస్తామనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కౌశల్యబాయి పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

## మహిళలు చైతన్యవంతం కావాలి



**నందికొట్కూరు, మార్చి 7,ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా చైతన్య వంతంగా చట్టాలపై అవగాహన కలిగినప్పుడే తమ కుటుంబానికి రక్షణగా నిలుస్తారని నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఇందిరా ప్రియ దర్శిని తెలిపారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా కోర్టు ఆవరణంలో కేక్ కట్ చేశారు. అనంతరం జడ్జి మహిళా సాధికారత గురించి వివరించారు. మహిళా తల్లిగా, బిడ్డగా, చెల్లిగా, అక్కగా భందు వర్గం అంటూ భంధాల వలయంలో చిక్కుకునేది. కుటుంభ భాధ్యతలు,పిల్లల పెంపకంలో పడి ఎన్నడు తన అభిప్రాయాలను, ఆలోచనలను బయటపెట్టే వీలు ఉండేది కాదు. ఆఖరి నిమిషం వరకు ఆపరిధిలోనే జీవించి ఉండేది. అలా కాకుండా మహిళలు విద్యా పరంగా, సామాజికంగా ఎదిగినపుడే మంచి గుర్తింపు ఉంటుందని ఆమె పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కోర్టు మహిళా సిబ్బంది, వివిధ శాఖల మహిళా అధికారులు పాల్గొన్నారు.

## నందికొట్కూరు వాసి గుజరాత్‌లో ప్రత్యక్షం



**నందికొట్కూరు,మార్చి 7,ప్రభాతవార్త:** గుజరాత్‌లో మనవజోత్ బుజ్‌కుచ్ ప్రాంతంలో ఓ వ్యక్తి పోలీసులతో తనది నందికొట్కూరు అని నాతండ్రి బాలస్వామి, తల్లి క్రిష్ణమ్మ, నా పేరు శ్రీనువాసు అని చెబుతున్నట్లుగా మాకు సమాచారం వచ్చిందని, ఇతని సంభంధీకులు ఎవరైన ఉంటే ఫోన్ నెం. 02832- 224000కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చేనని రూరల్ సి.ఐ. ఓ.విజయబాస్కర్ తెలిపారు.

## కుల దురహంకారిని వెంటనే అరెస్టు చేయాలి



**ఆదోని రూరల్,మార్చి 7,ప్రభాతవార్త :** దళిత మహిళను కొంగుపట్టి లాగి దాడి చేసిన కుల దురహంకారిని వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ మండల అధ్యక్ష,కార్యదర్శులు మునిస్వామి,తిక్కప్పలు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని నాగనాథనహళ్లి గ్రామంలో కుల దురహంకార దాడికి గురై ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జయమ్మను వారు పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థలం వివాదానికి సంబంధించి కొన్ని సంవత్సరాల నుండి జయమ్మను గుండమ్మ బెదిరిస్తూ ఇబ్బంది పెట్టేవారని అదే స్థలానికి సంబంధించిన సమస్యపై సోమవారం రాత్రి జయమ్మను అడ్డగించిన గుండమ్మ,యేసు,చిన్న ఈరమ్మలు మాటమాట పెంచుకుని దూషిస్తూ దాడి ప్రారంభిస్తే గుండమ్మ తరుపున బాగా మద్యం సేవించి అక్కడికి వచ్చిన వైసిపి నాయకులు పురుషోత్తంరెడ్డి దళిత జయమ్మను చీర కొంగు పట్టుకుని లాగి కిందకు పడేసి రాడ్డుతో తలపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. దాడి జరిగి మూడురోజులైనా నింధితులందరిపై కేసు నమోదు చేసి,కుల దురహంకారిని అరెస్టు చేయడంలో పోలీసులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. జయమ్మపై దాడి చేసిన పురుషోత్తంరెడ్డి,గుండమ్మ, యేసు,చిన్న ఈరమ్మలతో పాటు కుల దురహంకార దాడికి ప్రతయ్నించిన అందరిపైన ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

## కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే ఆలూరు ఎమ్మెల్యేగా పోటీ



**ఆలూరు,మార్చి 7,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కాంగ్రెస్ నాయకులు నాగరాజు యాదవ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ఆయన కలిసి ఆలూరు అసెంబ్లీ టికెట్ తనకు కేటాయించాలని కోరినట్లు నాగరాజు యాదవ్ తెలిపారు. ఈ సందర్బంగా గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకుల సమావేశం అనంతరం కర్నూలు జిల్లా అధ్యక్షుడు బాబురావుతో కలిసి పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు చేశామని తమను గుర్తించి ఆలూరు టికెట్ కేటాయించాలని వారు పిసిసి అధ్యక్షురాలు షర్మిలను కోరారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**పగిడ్యాల, మార్చి 7,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పగిడ్యాల మండల సమైక్య కార్యాలయంలో ముందస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం జరుపుకున్నారు. ఈ సంధ్భంగా ఉత్తమ సేవలు స్వయం సహాయక సంఘాలు అందించిన నందకు కెనరా బ్యాంక్ మేనేజరు కావేరి , యూనియన్ బ్యాంక్‌అసిస్టెంట్ మేనేజరుముంతాజ్‌బేగంకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భగా ఎపిఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వసంక్షేమ పథకాలు మహిళలకు అందించాయన్నారు. మహిళలు సాధికారత వైపు అడగులు వేస్తునా ్నరన్నారు. కార్యక్రమంలో సిసిలు ఉమామహేశ్వరి, జంగిలయ్య, యాపిలయ్య, నాగన్న, మండల సమైక్యఅధ్యక్షురాలు విజయమ్మ, కోశధికారి నిర్మలమ్మ, లక్ష్మిదేవి, గ్రామ సంఘం ప్రతినిదులు పాల్గొన్నారు.

## మేము సిద్ధం.. మా పోలింగ్ బూత్‌లు సిద్ధం..



**తుగ్గలి,మార్చి 7,ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాంకొండ,శభాష్‌పురం గ్రామాల్లో మేము సిద్ధం..మా పోలింగ్ బూత్‌లు సిద్ధం..అనే కార్యక్రమాన్ని రాంకొండ సర్పంచ్ గౌరవ సలహాదారుడు పాటిల్ సుధాకర్‌రెడ్డి,శభాష్‌పురంలో సచివాలయ మండల కన్వినర్ ఆర్ హనుమంతులు నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ఆదేశాల మేరకు గ్రూప్ కమిటీ మీటింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. 2024ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీ సభ్యులతో చర్చించి ప్రతి గడపకు వెళ్లి జగనన్న చేసిన మంచిని వివరించి రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నకు ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు అండగా నిలవాలని వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాంకొండలో విద్యాకమిటీ చైర్మన్ నాగరాజు,చాణిక్య,సుధా, సతీష్,దుబ్బ రాముడు,శభాష్‌పురంలో గోపాల్,సచివాలయ కన్వినర్ శ్రీనివాసులు,వెంకటేష్, ఈరన్న,రాఘవయ్య,రామాంజనేయులు,బూత్ కార్యకర్తలు, కమిటీ సభ్యులు గృహ సారథులు,సచివాలయ కన్వినర్లు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



**పెద్దకడుబూరు,మార్చి 7,ప్రభాతవార్త :** మండల పరిధిలో జాలవాడి గ్రామంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతూ ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని వారిపై సంబంధిత జిల్లా,మండల స్థాయి అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి నేత బోయ ముక్కన్న కోరారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో అన్ని సమస్యలు సచివాలయాల ద్వారనే పరిష్కారం అవుతాయని చెప్పే వైసిపి నాయకులు సచివాలయానికి సిబ్బంది రాకపోతే ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రతిరోజు దాదాపు 11గంటలకు సిబ్బంది హాజరవుతున్నారని హాజరయ్యే సిబ్బంది కూడా ఇద్దరు ముగ్గురు మాత్రమే సచివాలయానికి వస్తున్నారని మిగతా వారు ఎక్కడ పోతారో తెలియదని ఆయన విమర్శించారు. ప్రజలు సమస్యలపై సచివాలయానికి వెళితే అసలు పట్టించుకోవడం లేదన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పనిచేయని సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికైనా నెలనెలా ప్రభుత్వ జీతం తీసుకుంటున్న సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరై పేదల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

## భానుడి భగభగలు...



**గడివేముల, మార్చి07, ప్రభాతవార్త;** మే నెలలు నమోదు కావాల్సిన ఉష్ోణ్గ్రతలు ఇప్పుడే నమోదు అవుతుండడంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. గురువారం నాడు మండలకేంద్రమైన గడివేముల లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఉదయం, సాయంత్రం వేళలోల కాస్త చల్లబడినా గత కొద్ది రోజులుగా మధ్యాహ్నం ముఖం మాడిపోయేలా ఎండలు ఉంటున్నాయి. గడివేముల మండల వ్యాప్తంగా ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. భానుడు తన ఉగ్రరూపాన్ని చూపడంతో జనం అడుగు బయటపెట్టాలంటే కాస్త జంకుతున్నారు. మధ్యాహ్న సమయంలో భానుడి ప్రతాపం ఎక్కువ అవ్వడంతో జనాలు బయటికి రాకపోవడంతో మండలకేంద్రం గడివేములలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉక్కపోత విపరీతంగా ఉండే అవకాశాలు లేకపోలేదు. ఎండలు మండిపోతుండడంతో ఇప్పటి నుంచే ప్రజల్లో ఏసీలు, కూలర్ల వినియోగం పెరుగుతోంది. ఎండల నుంచి ప్రజల రక్షణకు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి మొల్ల జాబిన్ సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్పా ఎండలో వెళ్లకూడదని, వేడి తీవ్రత తగ్గిన తర్వాత బయటకు రావాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లేటప్పుడు కనీస జాగ్రత్తలు పాటించాలని, తరచూ మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం, పళ్లరసాలను తీసుకుంటూ ఉండాలని తెలిపారు.

## పి కోటకొండలో మలేరియా కేసు నమోదు



**దేవనకొండ,మార్చి 7,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పి కోటకొండ గ్రామంలో 45ఏళ్ల కటికి బడే సాహిబ్ అనే వ్యక్తికి మలేరియా సోకినట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా తెలిపారు. గురువారం జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో దోమల నివారణకు మందును పిచికారి చేయించారు. అలాగే ఇంటింటికి తిరిగి జ్వరం వచ్చిన వారికి రక్త పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుంకన్న,సూపర్‌వైజర్లు రంగస్వామి,శ్రీధర్,జయలక్ష్మి,ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు,ఆశలు పాల్గొన్నారు.

## నిరుద్యోగులు తమ నైపుణ్యతను పెంపొందించుకోవాలి



**మంత్రాలయం,మార్చి 7,ప్రభాతవార్త:**ప్రస్తుతం నిరుద్యోగ యువకులు ఏదోఒక సంస్థలో ఉద్యోగానికి చేరి తమ నైపుణ్యతను పెంపొందించుకోవాలని తద్వారా అనుభవం ఏర్పడి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు.గురువారం నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో ఉన్న శ్రీ రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఎల్‌ఏ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.పేటిఎం,అమర్‌రాజా గ్రూప్,ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్,గ్రైండర్‌కన్ ప్రైవేట్ లిమిటెడ్,స్కైస్కాడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లయన ్స్ ప్రైవేట్ లిమిటెడ్,నవభారత్ ఫర్టిలైజ ర్ ్,శ్రీరామ్ చిట్స్ అండ్ ఫైనాన్స్,వికాస గ్యాన్‌ఖర్మ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీలలో ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిం చడ ం జరిగిందన్నారు.ఈ కంపెనీలలో వేతనాలు తక్కువ మొత్తంలో ఉన్నా మొదటగా యువత అనుభవం సంపాదించాలన్నారు.ప్రభుత్వం వాలంటీ ర్లు,సచివాలయ ఉద్యోగాలతో యువతకు ఉద్యోగాలు కల్పించిందన్నారు.ఏపి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీ యమ న్నారు. అనంతరం పలువురు అధికారులు ప్రదీప్‌రెడ్డిని దుశ్శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఈ జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి,వైసిపి మండల అధ్యక్షులు భీంరెడ్డి,ఎస్‌ఐ గోపినాథ్,సర్పంచ్ భీమయ్య,వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున,ప్రిని ్సపల్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లీం మైనార్టీ హక్కుల సాధన కోసం ఉద్యమించాలి



**నంద్యాల, మార్చి 7, ప్రభాతవార్త ప్రతినిధిః** అనాదిగా అన్నిరంగాల్లో వివక్షకు గురవుతూ పేదరికంలో మగ్గుతున్న మైనార్టీ వర్గాల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని రాష్ట్ర ముస్లీం మైనార్టీ నాయకులు డా.షేక్ మహబుబ్ బాష పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ వర్గాల హక్కుల సాధన కోసం నంద్యాలలో ఈనెల 10న ముస్లీం మైనార్టీ హక్కుల మహాగర్జనకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ముస్లీం మైనార్టీలకు చెందిన వక్ ్ఫ ఆస్తుల పరిరక్షణ, ఐక్యమత్యంగా పోరాడుదామన్నారు. రాష్టంలో వక్ ్ఫకు చెందిన భూములు దాదాపు 66 వేల ఎకరాల భూములున్నా సగం భూ కబ్జాదారుల హస్తాల్లో ఉండి నగిలిపోతున్నాన్నారు. రాజకీయ పార్టీలు మైనార్టీలను ఓటు బా ్యంకుగా గుర్తించి పబ్బం గడుపుతున్నారన్నారు. మైనార్టీలకు కంటితుడుపు చర్యగా అధికారాలు లేని శాఖలను కేటాయిస్తు చేతులు దులుపుకుంటున్నారన్నారు. కర్నూలులో శిథిలావస్థలో ఉన్న యూనాని కాలేజి అభివృద్ధికి నిధులు కేటాయించి భవనాలు నిర్మించాలన్నారు. అన్యాక్రాంతమై వక్ఫ్‌భూములను గుర్ ్తచడానికి గ్రూప్ 1 స్థాయి అధికారిని నియమించి జూడిషియల్ అధికారాలు కల్పించాలన్నారు. రాజకీయ పార్టీలు ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల కేటాయింపుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు.

## దళితుల ఉద్యమనేత పారా రాఘవేంద్రను పరామర్శించిన నాయకులు



**మద్దికెర,మార్చి 7,ప్రభాతవార్త :** మద్దికెరలో పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న సర్వేనంబర్ 444/2బి ప్రభుత్వ భూమి మైదానంలో దళితుల ఇంటి పట్టాలు ఇవ్వాలని అధికారులకు వినతిపత్రం అందచేస్తూ బుధవారం పత్తికొండ ఆర్డీఓ కార్యాలయం ముందు ఏపి ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దికెర పారా రాఘవేంద్ర పురుగుల మందు సేవించి ఆసుపత్రి పాలు కావడం జరిగింది. కర్నూలు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రాఘవేంద్రను గురువారం ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు ఎస్ సుభాష్ చంద్ర మాదిగ,జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్,ఎంపిఎస్ రాష్ట్ర నాయకులు రాజుపూడి ఆనంద్ మాదిగ,బుడుగ జంగాల నాయకుడు తాటికొండ నారాయణ,కళామండలి రాష్ట్ర అధ్యక్షులు,ఎమ్మార్పీఎస్ కర్నూలు టౌన్ సత్య మాదిగలు పరామర్శించడం జరిగింది. దళితుల హక్కుల కోసం పాటుపడుతూ పోరాటాలు చేసే దళిత నాయకుల ప్రాణాలతో అధికార పార్టీ నాయకులు వారి స్వలాభాల కోసం దళితుల ప్రాణాల మీదికి సమస్యలు వచ్చేలా పాల్పడుతున్నారని ఇలాంటి పనులు మద్దికెర అధికార పార్టీకి చెందిన నాయకులు మానుకోవాలని ఘాటుగా ఖండించారు. రాఘవేంద్ర చేస్తున్న ఉద్యమానికి జిల్లాలోని అన్ని దళిత సంఘాలు మద్దతు తెలుపుతూ అండగా నిలుస్తామన్నారు.

## సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం..

:-ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు..



**దొడ్డిబెళగల్/కోసిగి, మార్చి 7, ప్రభాతవార్త :** సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కాత్యాయిని, గ్రామ సర్పంచ్ మాలపద్మలు అన్నారు.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రిలియన్స్ పౌండేషన్ ఆధ్వర్యంలో దొడ్డి బెలగల్‌లోని చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో అలాగే కోసిగిలోని 15వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కాత్యాయిని మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు ముందుండటం సంతోషకరమన్నారు.. అయితే మన దేశంలో ఇంకా మహిళలు వివక్షకు గురికావడం విచారకరమన్నారు.. దేశంలో, ప్రపంచంలో మహిళల సంఖ్య తగ్గుతుందని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు.. మహిళ దినోత్సవం జరుపుకునేందుకు ముందుకు వచ్చిన రిలియన్స్ ఫౌండేషన్ ప్రతినిధి భీమేష్ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు..అనంతరం మహిళా సర్పంచ్ మాల పద్మను, సూపర్‌వైజర్ కాత్యాయినిని గ్రామ మహిళలు సన్మానించారు.. అలాగే వివిధ పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులను రిలియన్స్ ఫౌండేషన్ ప్రతినిధి భీమేష్ అందించారు..

**కోసిగిలో:-**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన కోసిగిలోని 15వ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్లు విజయకుమారి, కాత్యాయినిల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ముందస్తుగా నిర్వహించారు.. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు.. ముఖ్యంగా మహిళలు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన అంగన్‌వాడీలకు బహుమతులను అందించారు..

## మిల్టన్ గ్రామర్ హైస్కూల్‌లో మహిళా దినోత్సవం

**ఆదోని రూరల్,మార్చి 7,ప్రభాతవార్త :** పట్టణంలోని మిల్టన్ గ్రామర్ హైస్కూల్ నందు ఒకరోజు ముందుగా గురువారం మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంధ్యారాణి హాజరై మహిళల గురించి వారి గొప్పతనం గురించి చక్కగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ అంటేనే మల్టీటాలెంట్ అని,ఆడది ఫిజికల్‌గా స్ట్రాంగ్ ఉండకపోవచ్చు కానీ మెంటల్లీ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుందని తెలియజేశారు. ప్రతి పురుషుడికి భాద్యత నేర్పేది స్త్రీ అని ఆమె తెలిపారు. దేవుడిచ్చిన ప్రతిరూపమే స్త్రీ అన్నారు. కరస్పాండెంట్ సిహెచ్ రమేష్‌బాబు, ప్రిన్సిపల్ నాగరాజులు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఒక స్త్రీ చదివితే ఆ ఇల్లు గొప్ప ఉన్నతమైన స్థానంలో ఉంటుందన్నారు. నేటి యుగంలో ఆడపిల్ల అయినా మగపిల్ల అయినా సమానం అని తెలియజేశారు. నేటి సమాజంలో స్త్రీని గౌరవించడం అందరి భాద్యత అన్నారు. నేడు సెలవు కావున ఒకరోజు ముందుగానే మహిళా దినోత్సవం జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# గ్రామవాసుల కల నేటితో నెరవేరబోతుంది



**బనగానపల్లె, మార్చి7, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలం లోని క్రిష్ణగిరిమెట్ట నుంచి మంగంపేట, కాశిరెడ్డినాయన ఆశ్రమం అలేబతండా వరకు రూ.21.50కోట్లతో నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డుకు బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డిలు భూమిపూజ నిర్వహించారు. ఈ ప్రాంతవాసుల కల నేరవేరుతుందని ఆనందోత్సవాలతో మంగంపేట గ్రామ ప్రజలు కాశిరెడ్డినాయన ఆశ్రమం భక్తులు పెద్దఎత్తున సంబరాలతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కాటసాని తిరుపాల్‌రెడ్డిలకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ క్రిష్ణగిరి మెట్ట నుంచి కాశిరెడ్డినాయన ఆశ్రమం వరకు రహదారి సరిగాలేకపోవడంతో మంగంపేట గ్రామం మరియు కాశిరెడ్డినాయన ఆశ్రమానికి వెళ్లే భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని వర్షాకాలం వచ్చిందంటే ఈ గ్రామాలు జలదిగ్భంధంలో చిక్కుకొనిపోయేటివని రాక పోకలు పూర్తిగా స్తంభించిపోయేవని ఈ బీటీ రోడ్డు నిర్మాణానికి ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయని అయినా కూడా ఇచ్చిన మాట కోసం పోరాడి నేడు బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఈ ప్రాంతవాసుల కల నేటితో నెరవేరబోరుతుందని నిత్యం ప్రజల కోసం కష్టపడే నాయకుడినే మనం ఎన్నుకుంటే ఇలాంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని చెప్పారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని అప్పుడే బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పాటు అందించినవారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాశిరెడ్డినాయన ఆశ్రమం వ్యవస్థాపకులు గణపతినాయన స్వామి, రోడ్లు మరియు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్‌రెడ్డి, డివిజనల్ ఇంజనీర్ సునీల్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ఉసేని, బనగానపల్లె మండల పరిషత్ అధ్యక్షురాలు మానసవీణ, బనగానపల్లె మండలం వైసీపీ కన్వీనర్ సన్నల జనార్ధన్‌రెడ్డి, వైసీపీ పార్టీ నాయకులు ఈశ్వర్ నాయక్, మంగంపేట సర్పంచ్ లక్ష్మి, చెర్లోకొత్తూరు సర్పంచ్ ఒంటెద్దుల సుజాత, పసుపల సర్పంచ్ మహేశ్వ రమ్మ, జోలాపురం సాధనగిరి నాగార్జునరెడ్డి, సుధాకర్, గోపాల్, రామసుబ్బారెడ్డి, బాలరాజు, మోపూరి శ్రీను, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 25 కుటుంబాలు టీడీపీని వీడి వైసీపీలో చేరిక



**- వైసీపీ కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన కాటసాని జయమ్మ, కాటసాని ఓబుళరెడ్డి**
**- జగనన్న అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసీపీలోకి వలసలు**
**- పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తానం - కాటసాని జయమ్మ, కాటసాని ఓబుళరెడ్డి**

**బనగానపల్లె, మార్చి7, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం నందు బనగానపల్లె పట్టణానికి చెందిన గోపాల్‌నగర్, కూరగాయాల మార్కెట్ కాలనీకి చెందిన 25 కుటుంబాలు టీడీపీని వీడి వైసీపీలో చేరారు. వలి, కరివేపాకు సుధాకర్, మాబాషా, మరియమ్మ, ఆశాకుమారి, షహరాబీ, అమీనా, రాణి, సునీతల తోపాటు 15 మందికి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, వైసీపీ యువనేత కాటసాని ఓబుళరెడ్డిలు వైసీపీ కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాటసాని జయమ్మ, కాటసాని ఓబుళరెడ్డిలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని తెలిపారు. అలాగే సంక్షేమంతోపాటు కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టడం జరిగిందని తెలిపారు. నాడు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల ద్వారా కేవలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను దోచుకోవడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలంటే మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డిని బనగానపల్లె నియోజకవర్గ ప్రజల మరోసారి ఆశీర్వదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మైనార్టీసెల్ కార్యదర్శి అత్తార్ జాహీద్ ఉసేన్, గట్టు రమేష్, శివయ్య, పాపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, కోనేటి దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించండి: జేసి



**శ్రీశైలంప్రాజెక్టు, మార్చి07, ప్రభాతవార్త :** ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంకు మహాశివరాత్రి బ్రహోత్సవాలకు వచ్చిన ఆధికారులందరు తమ విధులను సక్రంగా నిర్వర్తించాలని నంద్యాల జిల్లా జేసి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యాలో తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వ్యాక్యనించారు. గురువారంనాడు దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన బ్రహ్మోత్సవ సమీక్ష సమావేశంలో జోనల్ ఆధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో దేవస్థానం కార్యనిర్వహణాదికారి డి.పద్దిరాజు, ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావులతో కలసి సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. హటకేశ్వరం ప్రదేశాలలో ఏర్పాటు చేసిన షాపులను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పోలిస్ అధికారులను ఆదేశించారు. దర్శనం క్యూకాంప్లేక్స్‌లో వేచి ఉండే భక్తులకు అల్పాహారం, మంచినీరు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజున మరింత అధిక సంఖ్యాలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకు తగిన ఏర్పాట్లు సంబందింత అధికారులు చేసుకోవాలని ఆదేశించారు. ప్రదానంగా పోలీస్, రెవిన్యూ, ఆరోగ్యం, పారిశుధ్యం సిబ్బంది మూడు షిప్పులుగా విధులు కేటాయించి ఎక్కడ ఎలాంటి లోపాలు జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు.

## ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం..!



**ఆస్పరి, మార్చి 7, ప్రభాతవార్త :** నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా తెదేపా అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం రాత్రి హలిగేర గ్రామంలో పర్యటించారు. గతంలో గ్రామంలో చంద్రబాబు అరెస్టుతో మనస్థాపానికి గురై మృతి చెందిన టిడిపి కార్యకర్త ఉరుకుందప్ప కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించి మృతుడి భార్య బోయ శేషమ్మకు రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందించారు. ముందుగా మృతుడు బోయ ఉరుకుంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 27సెప్టెంబరు 2023లో హలిగేర గ్రామంలో బోయ ఉరుకుంద(42) మనోవేదనకు గురై గుండెపోటుతో మృతిచెందడం జరిగిందన్నారు. చంద్రబాబు అరెస్టుతో మనస్థాపానికి గురై మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శిస్తున్న సందర్భంలో ఆయా ప్రాంతాలకు వెళ్లినప్పుడు జనం చూపుతున్న ఆదరణ, కురిపించే ప్రేమ మా కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని నింపిందని, టిడిపి కార్యకర్తల కుటుంబాలను గుండెల్లో పెట్టుకుంటామన్నారు. నేడు రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని త్వరలోనే బాబుతో మంచి పాలన మొదలవుతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, పత్తికొండ టిడిపి భాద్యులు శ్యాంబాబు, ఆదోని టిడిపి మాజీ భాద్యులు కృష్ణమ్మ, ఆదోని టిడిపి భాద్యులు మీనాక్షినాయుడు, ఆలూరు టిడిపి మాజీ భాద్యులు వైకుంఠం మల్లికార్జునచౌదరి, శశిసుధ, జ్యోతి, ఎల్లార్తి మల్లికార్జున, తుగ్గలి నాగేంద్ర, టిడిపి తాలుక నాయకులు వంశీరెడ్డి, మండల కన్వీనర్ పరమారెడ్డి, ప్రధాన కార్యదర్శి శేషాద్రినాయుడు, మాజీ సొసైటీ డైరెక్టర్ కృష్ణయాదవ్, వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ నౌనేపాటి చౌదరి, ఎంపిటిసిలు రహీంతుల్లా, నరసన్న, మాజీ ఎంపిటిసిలు రామాంజనేయులు, జేమ్స్, ప్రసాద్‌రెడ్డి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



**మంత్రాలయం, మార్చి 7, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై టిటిడి పాలక మండలి సభ్యులు సీతారామిరెడ్డి, కర్ణాటక హైకోర్టు జడ్జి జ్యోతి ములిమణి వేరువేరు సమయాల్లో మంత్రాలయం విచ్చేశారు. వీరికి శ్రీమఠం అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీమఠం ఆనవాయితీ ప్రకారం ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని మంగళ హారతులిచ్చారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీమఠం ప్రాకారంలో తిరుగుతూ మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు శ్రీ రాఘవేంద్రస్వామి మొమెంటో, ఫల, పుష్ప, మంత్రాక్షితలతో ఆశీర్వదించారు. వీరివెంట శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహామూర్తి, వైసిపి మండల అధ్యక్షులు భీంరెడ్డి, సర్పంచ్ భీమయ్య, రిటైర్డ్ తహశిల్దార్ వర్మ, ఎస్ఐ గోపినాథ్, తదితరులు ఉన్నారు.

## ఆ దుండగులు పెట్టిన నిప్పు.. అడవి మొక్కలకు ముప్పు



**కొత్తపల్లి, మార్చి7, ప్రభాతవార్త :** మండలంలోని కొత్తమాడుగుల సమీపంలోని అటవి మొక్కల్లో ఎవరో తెలియని దుండగులు పెట్టిన నిప్పుకు ఎండిన గడ్డి మొత్తం కాలిపోయింది. సూమారుగా 10 ఎకరాల వరకు మంటలు వ్యాపించాయని ఆ మంటలతో అటవీ భూమిలో ఉండే మొక్కలకు ముప్పు ఉందని స్థానికులు చెబుతున్నారు. అటవీ భూమిల్లోని మొక్కలకు వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రత్యేక రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ టిక్కెట్ కోసం షర్మిలను కలిసిన మద్దిలేటి



**డోన్, మార్చి 7, ప్రభాతవార్త :** డోన్ అసెంబ్లీ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన అప్లికేషన్‌ను పరిశీలించాలని కోరుతూ పిసిసి అద్యక్షురాలు షర్మిలను డిసిసి ప్రధాన కార్యదర్శి మరియు డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జి గార్లపాటి మద్దిలేటి స్వామి గురువారం కలిసి చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా టిక్కెట్‌లు ఆశిస్తున్న అభ్యర్థులతో ముఖాముచ కార్యక్రమాన్ని షర్మిల విజయవాడ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో చేపట్టారు. ఇందులో బాగంగా డోన్ తరుపున మద్దిలేటి హాజరై ముఖాముచ కార్యక్రమంలో పాల్గొన్ని తన ధరఖాస్తును, గత పది సంవత్సరాలుగా డోన్ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని పరిశీలించి డోన్ ఎంఎల్ఏ టిక్కెట్ కేటాయించాలని కోరారు. 2006లో చిన్నమల్కాపురం ఎంపిటిసిగా పోటీచేసి ఓడిపోయినప్పటికి మరల 2014లో డోన్ జడ్పీటిసిగా కాంగ్రెస్‌పార్టీ తరుపున పోటీచేసి ఓడిపోయినప్పటినుంచి పార్టీ నమ్ముకుని ఇప్పటివరకు నంద్యాల జిల్లా ప్రధానకార్యదర్శిగా ఉంటూ చేపట్టిన క్రియాశీల కార్యక్రమాలతోకూడిన నివేదికను షర్మిలకు అందజేసారు. ఇంటింటికి కాంగ్రెస్ కార్యమ్రకాన్ని నిర్వహించి ప్రజలకు తెలియజేస్తూ పార్టీ అభివృద్ధి కృషిచేయడం జరిగింది కావున ఎన్నో సంవత్సరాలు సొంత ఖర్చులతో పార్టీలో పనిచేస్తూ జండా మోసి నీతి నిజాయితీగా పనిచేసి వివిధ కార్యక్రమాలను చేసి ప్రనజల్లో తీసుకెళ్లిన తన అభ్యర్థిత్వాని పరిశీలించాలని కోరినట్లు మద్దిలేటి పాత్రికేయులకు తెలిపారు.

## మా స్థలంలో హెచ్చరిక బోర్డులు ఎలా ఏర్పాటు చేస్తారు?



**నంద్యాల, మార్చి 7, ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల పట్టణంలోని యస్‌బిఐ కాలనీలో ఉన్న సర్వే నెంబరు 2313/1 మా స్థలము మున్సిపాల్టి వారు హెచ్చరిక బోర్డు ఎలా ఏర్పాటు చేస్తారని మూడు ఎకరాలు మున్సిపల్ చైర్మన్ పేరున ఎలా రిజష్టరు అవుతుందని బోర్డులు తొలగించక పోతే న్యాయస్థానము అశ్రయిస్తామని భూమి కొనుగోలుదారుడు మూర్తిరెడ్డి. యుగంధర్‌రెడ్డి అన్నారు. గురువారము ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశములో అయన మాట్లాడుతూ నంద్యాల మున్సిపల్ పరిదిలో యస్‌బిఐ కాలనీలోని సర్వే నెంబరు 2313/1సి భూమి రిజిష్టేషన్ అక్రమము కాదని సక్రమమే అని చెప్పారు. న్యాయపరమైన అంశాలు పరిశీలించుకుని జిపిఎ హోల్డర్ నుంచి కొనుగొలు చేయడము జరిగిందన్నారు. నంద్యాల, కోవెలకుంట్ల రిజిస్టేషన్ కార్యాలయంలో కంప్యుటర్లు పని చేయక పోవడముతోబేతంచెర్ల రిజిస్టేషన్ కార్యాలయంలో రిజిస్టేషన్ చేయడము జరిగిందన్నారు. 1986లో హౌసింగ్ కాలనీ కోసం సేకరించిన పొలంలో మేము కొనుగోలు చేసిన పొలం అన్నదమ్ములమద్య వివాదము వుండేదని అన్నారు. గతంలో అదికారులు మూడు ఎకరాల 40 సెంట్లు భూమి వివాదములో వుందని పొందుపరచడము జరిగిందని అన్నారు. ఇద్దరు అన్నదమ్ములలు బాగపరిస్కారాలు చేసుకోవడము కొద్దిరోజులకే వారు మరణించడముతో వారి వారసులు2022లో రఫీ ఉల్లాఖాన్ జిపి ఏ రిజిస్టరు చేయించారని అన్నారు. న్యాయపరమైన సమస్యలు వివాదాలు లేవు అని తెలుసుకొని అతని వద్ద కొనుగోలు చేశామన్నారు. భూమి రిజిస్టేషన్ అపే హకు 2 లేదనిఅంధ్రప్రదేశ్ హైకోర్టు క్లియరుగా చెప్పిందనిఅన్నారు. కొందరు మేము కొనుగోలు చేసిన భూమి స క్రమము కాదు అక్రమము అని ప్రచారము చేశారని చెప్పారు. మున్సిపల్ అదికారులు దౌర్జన్యము మా స్థలములో బోర్డు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. వాటిని వెంటనే తొలగించక పోతే న్యాయస్థానమును అశ్రయిస్తామని చెప్పారు.

## రాష్ట్రంలో ప్రజలే తెలుగుదేశం పార్టికి స్టార్ కాంపెయినర్స్-బిసి



**కోవెలకుంట్ల, మార్చి 7, ప్రభాతవార్త :** సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే తెలుగు దేశం పార్టికి స్టార్ కాంపెయినర్స్ రని ఇక్కడి కాటసానిఇష్టారాజ్యంగా ఒక వర్గానికి కొమ్ముకాస్తున్నాడని అక్కడ జగన్ కొత్తపన్నులు వేసి ధరలు పెంచి ప్రజల రక్తాన్ని జలగల్లాగా పీల్చేస్తున్నారని మాజీ యంయల్ఎ బిసి జనార్దనరెడ్డి అరోపించారు. బాబు షూర్టి భవిషత్తు గ్యారెంటీ కార్యక్రము నాల్గువ రోజున కోవెలకుంట్ల పట్టణంలోని గాందీసెంటరు నుండి గుద్దేటిపేట మీదుగా సాగింది. ఈ సందర్బము అయనకు అక్కడ స్వచ్ఛందము ప్రజలు గజమాలలతో స్వాగతము పలికారు. మూడు గంటలకు కార్యక్రమము ఉన్న బిసి అలష్యముగా 5.30వచ్చిన జనము అయన కోసం ఎంతో ఓపికతో వేచి ఉన్నారు. అనంతరము అయన ఇంటింటికి తిరుగు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తు ముందుకుసాగారు. అనంతరమము అయన విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌కు కౌంటడౌన్ మొదలైందని ఇక 40రోజుల్లో వైసిపి దురాగతాలకు ప్రజాకోర్టులో శిక్ష పడే సమయం అసన్నమైందన్నారు. ఎన్నికలకు తాము సిద్దంఅని జగన్‌రెడ్డి వైసిపి నాయకులు చెబుతుంటే మరో వైపు ప్రజలు కూడా జగన్‌రెడ్డి వైసిపి నాయకులను ఓడించడానికి సంసిద్ధంగా ఉన్నారని చెప్పారు. జగన్‌రెడ్డి అహంకారానికి వైసిపి అరాచక పాలనకు స్వప్తి పలికేందుకు రైతులు యువత ప్రభుత్వం ఉద్యోగులు అందరూ సంసిద్ధం ఉన్నారని చెప్పారు. ఇళ్ల పట్టాలను పేదలకు ఇవ్వకుండా వైసిపిలో తన వర్గానికే కాటసాని ఇస్తున్నాడని అరోపించారు. కోవెలకుంట్ల పట్టణంలో ఇల్లు లేని పేదలు చాలా మంది ఉన్నారని వారి ఘోష వినకుండా ఒక వర్గానికే కొమ్ము కాస్తూ పేదప్రజలను మోసం చేశారని అరోపించారు. అంధ్రప్రదేశ్‌ను పూర్తిగా నాశనము చేసిన ఏకైన పార్టి వైసిపి అన్నారు. ఇలాంటి పార్టిప్రజలకు అవసరము లేదు. కొత్తమ పన్నులు వేసి ధరలుపెంచి ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నారని అరోపించారు. ఈ అసమర్థ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో వైసిపి బాదితులు నష్టపోయిన రైతులు ఉద్యోగాలు రాని యువత మహిళలే టిడిపికి స్టార్ కాంపెయినర్స్‌ని ఒకప్పుడు 200 రూపాయలలు ఉన్న విద్యుత్ బిల్లుఉ ఇప్పుడు 5రెట్లు పెరిగి 1000రూపాయలకి చేరాయన్నారు. మద్యం, నిత్యవసరవపస్తువులధరలు అర్టిసి బస్సుల చార్జిలలను పెంచుతూ ప్రజలను దోచుకుంటున్నారని అరోపించారు. ఈ వైసిపి ప్రభుత్వంవైసిపి నుండి రాష్ట్రాన్ని కాపాడే బాద్యత మన అందరిది అంటు పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను ప్రతి గడపకు వెల్లి వివరించి ప్రజా ప్రభుత్వం టిడిపిని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో మురళీ, పెనుగొండ రాజశేఖరు, గాదంశెటి రమణయ్య, బివిప్రసాదరెడ్డి గడ్డంనాగేశ్వరరెడ్డి బండ్ల దస్తగిరి, తదిరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటు



**నంద్యాల టౌన్, మార్చి 7, ప్రభాతవార్త:** చిన్న చిన్న రోడ్లు వేస్తు, చిన్న చిన్నకల్వర్టులు కడుతూ మేం ఎంతో అభివృద్ధి చేశామని చెప్పుకొని పెద్ద పెద్ద శిలాఫలకాలు వేసుకోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఇలాంటి చిన్న చిన్న పనులు చేస్తు ఆ ఏరియాలకు ఉన్న ప్రాధాన్యత కోల్పోయేవిధంగా చేయడం ప్రభుత్వంపై మరియు అధికారులపై మాజీ మంత్రి ఫరూక్ ఫైర్ అయ్యారు. పట్టణంలోని మున్సిపల్ అఫీసు ఎదురుగా ఉన్న మౌలాన అబ్దుల్ కలాం స్థూపం ముందు స్థానిక ఎమ్మెల్యే వారి అనుచరులు శిల్పా ఫైలాన్‌ను ఏర్పాటు చేయడంతో మాజీ మంత్రి ఘాటుగా విమర్శించారు. స్పందించిన అధికారులు శిల్పా పేరును తొలగించారు. ఈసందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ పట్టణంలో రోడ్ డివైడర్లు ఏర్పాటు చేసి స్ట్రీట్ లైటింగ్ సిస్టం తెచ్చింది టిడిపి హయాంలోనే అని పేర్కొన్నారు. వీటిని మేమే అభివృద్ధి చేశామని చెప్పుకొని పెద్ద పెద్ద శిలాఫలాకాలు వేసుకోవడం విడ్డూరమన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఔదార్యం

**- ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్ల పంపిణీ**

**బనగానపల్లెరూరల్, మార్చి7, ప్రభాతవార్త:** బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఇటీవలే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమం నిర్వహిస్తున్న సందర్భంలో పలువురు దివ్యాంగులు వినతి మేరకు 12 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లను ఉచితంగా అందజేసి తన దాతృత్వ స్వభావాన్ని చాటుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేయడంతోపాటు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇప్పుడున్న రాజకీయ నేపథ్యంలో పలువురు రాజకీయ నాయకులు కేవలం వారి ఓట్ల కోసం ప్రజలకు వల్లమాలిన హామీలు ఇస్తూ తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలన్ని విస్మరించి పేద ప్రజలను గాలికి వదిలేస్తూ తమ రాజకీయ పబ్బం గడుపుకునే నాయకులు ఉన్న ఈ కాలంలో రాజకీయాలకు అతీతంగా పదవుల్లో ఉన్న లేకపోయినా ప్రతి నిత్యం తన నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ తమ సొంత నిధులతో ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ ఇచ్చిన మాట ప్రకారం అభాగ్యులకు అండగా నిలబడుతున్న నిస్వార్థ ప్రజాసేవకుడిగా బనగానపల్లె ప్రజల గుండెల్లో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని పలువురు దివ్యాంగులకు నేడు భరోసాగా నిలిచి వారికి అండగా నిలిచారు. దివ్యాంగులు ట్రైసైకిళ్లలేక వారు పడుతున్న ఇబ్బందులను చూసి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి చలించిపోయారు. ఈ మేరకు వారికి తన సొంత నిధులతో ట్రైసైకిళ్లు కొనిస్తానని అలాగే వారి జీవనోపాధికి తగిన సహాయం చేస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గురువారం బనగానపల్లె పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తన సొంత నిధులతో ట్రైసైకిళ్లను కొనుగోలుచేసి 12 మంది దివ్యాంగులకు ఉచితంగా అందించి మరోసారి తన పెద్దమనసును చాటుకున్నారు. అలాగే వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసానిచ్చారు. మాట తప్పి మడమ తిప్పే నాయకులను చూస్తున్న ఈ కాలంలో మాట ఇచ్చి నెరవేర్చిన నిఖార్సైన నాయకుడిగా బనగానపల్లె ప్రజల గుండెల్లో చెరగని సంతకంలా తనదైన ముద్ర మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి వేసుకున్నారు. ట్రైసైకిళ్లను అందించడంతో దివ్యాంగులు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డితోపాటు వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడంతోటు హర్షం వ్యక్తం చేశారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి



**దేవనకొండ, మార్చి 7, ప్రభాతవార్త :** అప్పుల భారంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ కోలుకోలేక రైతు మృతిచెందిన సంఘటన గురువారం మండల పరిధిలోని గుడిమిరాళ్ల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు ఇలా వున్నాయి. గుడిమిరాళ్ల గ్రామానికి యువ రైతు నల్లబోతుల నరసింహుడు(38)తనకున్న 12ఎకరాల పొలంలో పంటలు సాగు చేయగా పెట్టుబడుల కోసం దాదాపుగా రూ.10లక్షల మేర అప్పులు చేశాడు. పంటలు రాక దిగుబడులు లేక చేసిన అప్పుల భారంతో పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య సోమేశ్వరి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

## ఆర్డీటి సహకారంతో 60 పక్కా ఇళ్ళ నిర్మాణం



**నంద్యాల టౌన్, మార్చి 7, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణం 1వ వార్డు పరిధిలోని పివినగర్ మరియు హరిజనవాడలో గురువారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్డీటి సంస్థ ఆర్థిక సహకారం మరియు హౌసింగ్ బోర్డు లోన్ ద్వారా కల్పించిన 60 పక్కా గృహాలను లబ్దిదారులకు అందజేయడం జరిగింది. అలాగే హరిజనపేటలో 250 మందికి దాదాపు 12.5 లక్షల విలువగల 2.5 సెంట్ల స్థలాలను లబ్దిదారులకు పట్టాలను పంపిణి చేయడం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల క్రితం 1వ వార్డు పరిధిలోని హరిజనవాడ ప్రజలకు 250 మంది లబ్దిదారులకు ఇళ్ళపట్టాలు పంపిణి చేయడం జరిగిందన్నారు. అయితే కేటాయించిన లేఅవుట్‌లలో ఇళ్ళనిర్మాణం చేయకపోవడంతో ముళ్ళకంపలతో అడవిని తలపించేలా ఉన్న స్థలాన్ని నేడు శుభ్రం చేయించి తిరిగి రెవిన్యూ అధికారులతో లేఅవుట్‌లు వేయించి గతంలో ఏవరికైతే ఇళ్ళపట్టాలు పంపిణి చేశారో వారికి చెందిన స్థలాలను రెవిన్యూ రికార్డుల అధారంగా గతంలో ఇచ్చిన రితిగానే 250 మందికి ఇళ్ళస్థలాల పట్టాల పంపిణి చేయడం జరిగిందన్నారు. ఈవిలువైన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. అందుకు గాను ఆర్డీటి సంస్థ ఆర్థికసాయం అందించేందుకు ముందుకు వచ్చారని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలను గెలుపోటములను పరిగణలోకి తీసుకోకుండా అందరికి న్యాయం చేయడం జరిగిందన్నారు. హరిజనపేట అంటే శిల్పా కుటుంబం అడ్డా అని గుర్తుచేశారు. మీ బిడ్డ శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీ అందించి ఆశీర్వదించాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైరమ్నన్లు పాంషావలి, తహశీల్దార్, దేశం సుధాకర్‌రెడ్డి, వైసీపీ నాయకులు మాజీ కౌన్సిలర్ మునయ్య, కన్నమ్మ, ఎర్రన్న, తిమ్మరాజు, ఓబులేసు, బాబు, జయకుమార్, మధుబాబు, సాయిబాబా, బోడెన్న, ఆర్జున్, శేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.